సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



ముగిసిన సీబీఏ-2, ఫార్మేటివ్ పరీక్షలు


విద్యార్థుల్లో విద్యాస్థాయిని, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు నిర్వహించిన క్లాస్‌రూమ్ బేస్డ్-2, ఫార్మేటివ్-3 పరీక్షలు శుక్రవారంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముగిశాయి. - 8లో

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్న దాన ట్రస్టుకు కొటికలపూడి గోవిందరావు(భీమవరం) శుక్రవారం రూ. 1,11,111 విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 6,895 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మోరంపూడి జంక్షన్ వద్ద త్వరలో పూర్తిస్థాయిలో వంతెన నిర్మాణ పనులు చేపట్టనున్న దృష్ట్యా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ మాధవీలత అన్నారు. ఆ కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులు శుక్రవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంతెన నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ పోలీసులు క్షేత్ర స్థాయి పర్యటన చేసి సూచనలు చేయడం జరుగుతోందన్నారు. కలెక్టర్ మాధవీలతను కలిసిన వారిలో కాంట్రాక్ట్ ఏజెన్సీకి చెందిన మేనేజర్ సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

రూ. 3.71 లక్షల సరకు జప్తు

కాకినాడ సిటీ: పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై నమోదు చేసిన కేసులను విచారించి రూ.3,71,260 విలువైన సరకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ జాయింట్ కలెక్టర్ ఇలక్కియ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహన యజమానికి రూ.10 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. వంట గ్యాస్ సిలిండర్‌ను వ్యాపార అవసరాలకు వినియోగించిన దుకాణ యజమానులకు జరిమానా విధించామన్నారు.

నిడదవోలు రైల్వేగేటు పున: ప్రారంభం

పూర్తయిన రైల్వే ట్రాక్ మరమ్మతులు



మరమ్మతుల అనంతరం తెరుచుకున్న గేటు

నిడదవోలు : నిడదవోలు పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ఉన్న రైల్వేగేటు వద్ద ట్రాక్ మరమ్మతు పనులు పూర్తయ్యాయి. దీంతో శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు గేటును తిరిగి ప్రారంభించారు. రైల్వేగేటు వద్ద రైల్వే సెక్షన్ ఇంజినీర్ రావి రాజేష్, నిడదవోలు రైల్వే స్టేషన్ మేనేజర్ జి.సత్యనారారాయణ పూజలు చేసి గేటును పైకి ఎత్తారు. రైల్వే భద్రతా చర్యల్లో భాగంగా ట్రాక్ మరమ్మతుల కోసం రైల్వేగేటును గత నెల 30వ తేదీ ఉదయం 7 గంటలకు మూసివేశారు. పనులు పూర్తి కావడంతో గేటు ఎత్తి తిరిగి వాహనాల రాకపోకలను అనుమతించారు. రైల్వేశాఖ భద్రతా చర్యల్లో భాగంగా రెండేళ్లకు ఒకసారి రైల్వేగేటు లోపల ఉన్న ట్రాక్‌ల వద్ద మరమ్మతులు చేపడున్నారు. రోజుకు 200 రైళ్ల పైగా రాకపోకలు సాగించే ఈ మార్గంలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ట్రాక్‌ను పటిష్టపరిచారు. తొలుత రైల్వే అధికారులు ఈనెల 8న గేటు తెరుస్తామని ప్రకటించారు. పనులు ఆలస్యం కావడంతో రెండు రోజులు గడువు పెంచారు. ఈ సమయంలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్ సర్వీసులు నడిపారు.

రేపు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు

నాగవల్లితోట జంక్షన్(సిటీ): జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి సీనియర్ తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి బి.అర్జునరావు శుక్రవారం తెలిపారు. స్థానిక జిల్లా క్రీడామైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అన్నదాత పంట పండినట్టే..

- జిల్లా రబీ సాధారణ సాగు 83,880 హెక్టార్లు
- ఇప్పటి వరకు 70,562 హెక్టార్లలో వివిధ పంటల సాగు
- అత్యధికంగా 53,484 హెక్టార్లలో వరి
- అనుకూలించిన ప్రకృతి, సాగునీటి విడుదల
- మూడు పంటల సాగు దిశగా అడుగులు



కడియం మండలం దుళ్లలో సాగవుతున్న వరి

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరిలో సహజ జలాల లభ్యత.. సీలేరు, పోలవరం ప్రాజెక్టుల్లో వినియోగానికి అనుగుణంగా నీటి నిల్వ.. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ద్వారా డెల్టా ఆయకట్టుకు ముందస్తుగా సాగునీటి విడుదల. ఇలా సీజన్ ప్రారంభం నుంచి అనుకూల పవనాలు వీయడంతో రబీ సాగు వరించింది. కర్షకులు ఉత్సాహంగా కాడిపట్టారు. విత్తనాలు సకాలంలో అందుబాటులోకి రావడంతో నాట్ల ప్రక్రియ ఊపందుకుంది. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా వరి సాగు అత్యధికంగా 95 శాతానికి చేరింది. రబీలో వివిధ పంటల సాగు మరో వారం రోజుల్లో వంద శాతం పూర్తయ్యే సూచనలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా వరి సాగు చేపడుతున్నారు. ఈ ఏడాది గోదావరి, వరుణుడి కరుణ లభించడంతో సాగు పనులు ముమ్మరం చేశారు. రబీ సాధారణ సాగు విస్తీర్ణం 83,880 హెక్టార్లు కాగా.. ఇప్పటి వరకు 70,562 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగై 84 శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయి. అత్యధికంగా వరి సాగవుతోంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 56,433 హెక్టార్లు కాగా.. 53,484 హెక్టార్లు సాగై 95 శాతానికి చేరుకుంది. మిగిలిన పంటల సాగు సైతం ఉత్సాహంగా సాగుతోంది.

పొద్దుతిరుగుడు హవా

రబీలో పొద్దుతిరుగుడు సాగు హవా కొనసాగుతోంది. సాధారణ సాగు 172 హెక్టార్లు కాగా.. ఏకంగా 428 హెక్టార్లలో సాగై 249 శాతాన్ని నమోదు చేసింది. గత ఖరీఫ్‌లో 152 హెక్టార్లలో సాగైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఆగస్టులో గోదావరి వరదలు రావడం. అనంతరం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో వర్షాలు కురవడంతో పంటలకు మరింత ప్రోత్సాహం అందింది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 169.0 మిల్లీ మీటర్లు ఉండగా.. 189.9 మిల్లీ మీటర్లుగా నమోదైంది. 12.3 శాతం అధిక వర్షపాతం నమోదైంది. డిసెంబర్‌లో సాధారణం 6.7 మిల్లీ మీటర్లు కాగా.. 26.6 మిల్లీ మీటర్లు నమోదు చేసుకుంది. 295.5 శాతం అధిక వర్షపాతం కురిసింది.

ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగా..

రైతు సంక్షేమమే ప్రామాణికంగా భావిస్తూ ఏటా మూడు పంటల సాగు ప్రోత్సహించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. అందుకు అనుగుణంగా గత ఖరీఫ్‌లో ముందస్తుగా గతేడాది జూన్ 1వ తేదీన సాగు నీటిని విడుదల చేశారు. ఫలితంగా ప్రకృతి విపత్తులు, గోదావరి వరద నుంచి పంటను గట్టెక్కించుకునే అవకాశం కలిగింది. గతేడాది నవంబర్ మాసాంతం నుంచి రెండో పంటకు ముందస్తుగా నీటిని విడుదల చేశారు. నాలుగు మాసాల వ్యవధిలో పంటను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకువెళుతున్నారు. అలా జరిగితే మూడో అవకాశం ఉంటుంది. మినుములు, పెసలు లాంటి ఆరుతడి పంటలు పండించుకునే వెసలుబాటు దొరుకుతుంది. ఇదే విషయమై గతేడాది నవంబర్ మాసంలో కలెక్టరేట్‌లో జరిగిన ఐఏబీ సమావేశంలో చర్చించారు. ఆ దిశగా అధికాయ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ కోణంలో రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఆర్బీకేల్లో జిల్లా, మండల స్థాయి రైతుల సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు.

వారం రోజుల్లో వంద శాతం పూర్తి



రబీ సీజన్‌లో నాట్ల ప్రక్రియ సింహభాగం పూర్తయింది. సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాం. పంట సాగుకు అవసరమైన నీటిని సైతం విడుదల చేయడంతో రైతులు ఉత్సాహంగా సాగు చేపట్టారు. జిల్లాలో రబీ సాగు ఇప్పటికే 84 శాతం పూర్తయింది. మరో వారం రోజుల్లో వంద శాతం పూర్తి చేసేందుకు ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తున్నాం. వరి అత్యధికంగా 95 శాతం లక్ష్యాన్ని చేరుకుంది. 100 శాతం అధిగమించే అవకాశం ఉంది.

- ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాలో రబీ పంటల సాగు ఇలా...

పంట	సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)	శాతం
వరి	56,433	53,484	95
జొన్న	232	159	69
మొక్కజొన్న	11,676	8,828	76
శనగలు	1,085	666	61
బొబ్బర్లు	15	9	60
వేరుశనగ	325	195	60
పొద్దుతిరుగుడు	172	428	249
పొగాకు	6,869	5,639	82
మిర్చి	162	53	33

రత్నగిరిపై పెళ్లిసందడి

- శుక్రవారం వందకు పైగా వివాహాలు
- సత్యదేవుని దర్శించిన 50 వేల మంది
- 4,500 వ్రతాల నిర్వహణ
- దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం



రత్నగిరిపై జరుగుతున్న వివాహాలు

అన్నవరం: రత్నగిరిపై శుక్రవారం పెళ్లి సందడి నెలకొంది. వందల సంఖ్యలో నవ దంపతులు, వారి బంధుమిత్రులు, వీరికి తోడు సామాన్య భక్తులతో రత్నగిరిపై సత్యదేవుని ఆలయం కిక్కిరిసిపోయింది. మాఘమాసంలో విశేష మైన పర్వదినం కావడంతో శుక్రవారం తెల్లవారుజామున రత్నగిరిపై వందకు పైగా వివాహాలు జరిగాయి. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వందలాది మంది తమ బంధుమిత్రులతో కలిసి సత్యదేవుని ఆలయానికి వచ్చారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి వ్రతాల నిర్వహణ ప్రారంభించి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం వరకు భక్తులతో స్వామివారి ఆలయం కిటకిటలాడింది. సత్యదేవుని ప్రత్యేక దర్శనానికి గంట, సాధారణ దర్శనానికి రెండు గంటలు సమయం పట్టింది. భక్తులతో వ్రతమండపాలు నిండిపోవడంతో స్వామివారి నిత్యకల్యాణ మండపంలో ఉదయం పది గంటల వరకూ వ్రతాలు నిర్వహించారు. పండితులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ స్వామివారి నిత్య కల్యాణం నిర్వహించారు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించినట్టు అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 4,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షలు ఆదాయం సమకూరింది. నిత్యాన్నప్రసాద పథకంలో ఐదువేల మందికి భోజనం పెట్టారు. దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జిల్లాలో 108 మందికి పెళ్లికానుక

- రూ.91 లక్షలు జమ చేసిన ప్రభుత్వం
- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకం ప్రారంభం



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకం కింద జిల్లాలో తొలి విడతగా 108 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.91 లక్షలు అందించామని కలెక్టర్ మాధవీలత అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఉదయం 11 గంటలకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి 4,536 మంది ఖాతాల్లో రూ.38.18 కోట్ల నగదు జమ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయ మందిరంలో కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీతోఫా పథకం కింద జిల్లాలో 108 మందికి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పథకం ప్రయోజనాన్ని అందించామన్నారు. జిల్లాలో ఎస్సీలు 63 మంది, ఎస్సీ కులాంతర వివాహం చేసుకున్న నలుగురు, బీసీలు 33 మంది, బీసీ కులాంతర వివాహం చేసుకున్న ఐదుగురు, మైనార్టీ వర్గాలకు చెందిన ముగ్గురు.. మొత్తం 108 జంటలకు సొమ్మును వారి బ్యాంకుఖాతాలకు జమ చేశామన్నారు. గతేడాది అక్టోబరు ఒకటి నుంచి డిసెంబర్ 31 మధ్య వివాహం చేసుకున్న, అర్హత కలిగిన వారందరికీ ఈ ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. జిల్లాలోని మండలాల వారీగా అనపర్తిలో 5, బిక్కవోలులో 4, చాగల్లులో 11, కొవ్వూరులో 8, తాళ్లపూడిలో 3, దేవరపల్లిలో 4, నల్లజర్లలో 3, గోపాలపురంలో 7, గోకవరంలో 4, కడియంలో 5, రాజమహేంద్రవరం రూరల్‌లో 1, సీతానగరంలో 4, కోరుకొండలో 2, రాజానగరంలో 3, ఉండ్రాజవరంలో 11, నిడదవోలులో 8, పెరవలిలో 11, రాజమహేంద్రవరం అర్బన్ లో 14 మందికి వారి ఖాతాలలో నగదును జమ చేశామన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి, డీఎల్‌డీవోలు పి.వీణాదేవి, వి.శాంతమణి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు తక్షణ సాయం

- బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ
- వ్యక్తిగత ఆర్థిక సహాయం



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కాకినాడ క్రైం: రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా శుక్రవారం ఉదయం జి.రాగంపేట బాధిత కుటుంబాలను కాకినాడ జీజీహెచ్‌లో పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని వారికి భరోసా ఇచ్చారు. వేదనలో ఉన్న కుటుంబీకులకు మంత్రి రాజా వ్యక్తిగత ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రతి కుటుంబానికి రూ.50 వేలు చొప్పున నగదు అందజేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలను తక్షణమే అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం నేరుగా మార్చురీకి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. మంత్రి వెంట రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఉన్నారు.

వసతికి ప్రత్యేక ఏర్పాట్లు

మృతదేహాలు గురువారం మధ్యాహ్నానికి కాకినాడ జీజీహెచ్ మార్చురీకి చేరగా వారి కుటుంబీకులు పాడేరు నుంచి రాత్రికి వచ్చారు. దీంతో వారి వసతి కోసం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జీజీహెచ్‌లోని ఓపీ ఎస్ఎస్ఆర్‌లో 30 మందికి ప్రత్యేక గదులు కేటాయించి వసతి భోజన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారి సమ్మతితో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. బాధిత కుటుంబాల వసతి ఏర్పాట్లపై చొరవ చూపిన డాక్టర్ హేమలతాదేవిని మంత్రి దాడిశెట్టి రాజా ఈ సందర్భంగా అభినందించారు.



మార్చురీలో మృతదేహాలను పరిశీలిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా, దవులూరి దొరబాబు

ఊపిరాడకే దుర్మరణం

పాడేరుకు చెందిన ఐదు, పెద్దాపురానికి చెందిన రెండు, మొత్తం ఏడు మృతదేహాలకు జీజీహెచ్ ఫోరెన్సిక్ నిపుణులు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల జీర్ణకోశంతోపాటు శ్వాస నాళాల్లో చమురు అవశేషాలు గుర్తించారు. చమురు శ్వాస ఆడని స్థితిని కల్పించిందనీ తద్వారా ప్రాణాపాయానికి దారితీసిందని నిర్ధారించారు. మరణానికి ఊపిరాడకపోవడమే కారణమని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహాల పోస్టుమార్టం, ప్రముఖుల పరామర్శల నేపథ్యంలో జీజీహెచ్‌లోని మార్చురీ ఆవరణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మేధకు పదును.. ఉపాధికి అదను

- గెయిల్ నైపుణ్య కేంద్రం ద్వారా ఉచిత శిక్షణ
- 1,349 మందికి ప్రయోజనం
- 2015 నుంచి సేవలు



ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్‌లో శిక్షణ పొందుతున్న యువకులు

మామిడికుదురు: నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో గెయిల్ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏటా పలువురు నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇస్తోంది. 216వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, ఇండస్ట్రియల్ వెల్డర్, డ్రాఫ్ట్స్‌మెన్ మెకానికల్- ఆటోక్యాడ్ రంగాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమా పూర్తి చేసిన విద్యార్థులు ఇక్కడ ఉచితంగా శిక్షణ పొందుతున్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు కలిగిన విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. మూడునెలల పాటు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ఉచితంగా పుస్తకాలు, మెటీరియల్, యూనీఫాం అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో మూడు బ్యాచ్‌లుగా 90 మంది శిక్షణ పొందుతున్నారు. గత ఏడాది డిసెంబర్ నెలలో ప్రారంభమైన శిక్షణ మార్చి 28వ తేదీ వరకు కొనసాగుతుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగావకాశాలు కలిపించే బాధ్యత గెయిల్ తీసుకుంటుంది.

44 బ్యాచ్‌లుగా శిక్షణ...
866 మందికి ఉద్యోగాలు...

2015 ఫిబ్రవరి నెలలో గెయిల్ ఇక్కడ శిక్షణకు శ్రీకారం చుట్టింది. మొదట్లో ఆటోక్యాడ్ కోర్సులకు మాత్రమే శిక్షణ పరిమితమైంది. తర్వాత దీనికి మరో రెండు కోర్సులు జత చేశారు. ఇంతవరకు 44 బ్యాచ్‌లుగా 1,349 మందికి శిక్షణ ఇచ్చారు. ఉచిత శిక్షణలో భాగంగా ఇంటర్‌నెట్, ఈ-మెయిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాస నైపుణ్యం తదితర అంశాల్లో విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న ఒక్కొక్క విద్యార్థికి గెయిల్ సంస్థ సుమారు రూ.20 వేలు ఖర్చు చేస్తోంది. నిరుద్యోగులు ఇక్కడ శిక్షణ పొందడం ద్వారా పలు కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.

ఎలక్ట్రీషియన్‌గా శిక్షణ పొందుతున్నా



నేను ఐటీఐ చదివాను. రెండు నెలల పాటు ఇక్కడ పలు అంశాలపై నాకు శిక్షణ ఇచ్చారు. నా స్నేహితులు ఎంతో మంది ఇక్కడ శిక్షణ పొంది ఉద్యోగాలు చేస్తున్నారు.

- వి.గోపాలకృష్ణ, అమలాపురం

ఆటోక్యాడ్‌లో శిక్షణ పొందుతున్నా



నేను బీఎస్సీ కంప్యూటర్స్ చదువుకున్నాను. ప్రస్తుతం ఆటోక్యాడ్‌లో శిక్షణ పొందుతున్నాను. మరో నెల రోజుల్లో నా శిక్షణ పూర్తి అవుతుంది.

- అంకాని లీలాసాయికుమారి, పాశర్లపూడి, మామిడికుదురు మండలం

వెల్డింగ్‌లో శిక్షణ పొందుతున్నా



నేను ఐటీఐ చదువుకున్నా. వెల్డింగ్‌లో తర్ఫీదు పొందుతున్నా. నెలకు రూ.వెయ్యి స్టయిఫండ్ ఇస్తున్నారు. నిరుద్యోగులకు ఇది ఎంతో ఉపయోగం.

- కల్యాణి కార్తీక్, పొన్నమండ, రాజోలు మండలం

ఈ శిక్షణ నిరుద్యోగులకు వరం



నిరుద్యోగులకు ఈ శిక్షణ వరం. ఈ కేంద్రం ద్వారా ఇంత వరకు శిక్షణ పొందిన 1,349 మందిలో 866 మంది హైదరాబాద్‌లోని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- ఎ.సురేష్, సెంట్రల్ మేనేజర్, గెయిల్ నైపుణ్య శిక్షణ కేంద్రం

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు

జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మైనర్లకు వాహనం ఇస్తే తల్లిదండ్రులు, లేదా ఇందుకు బాధ్యులైన వాహన యజమానిపై చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. రాజమహేంద్రవరం డీ మార్ట్ నుంచి మోరంపూడి వెళ్లేదారిలో శుక్రవారం మోటార్ సైకిల్‌పై అతి వేగంగా వెళుతూ డివైడర్‌ను ఢీ కొట్టిన సంఘటనలో ఇరువురు మైనర్లు మృతి చెందారు. ఈ సంఘటనపై ఎస్పీ స్పందిస్తూ శుక్రవారం తాజాగా మార్గదర్శకాలు జారీ చేశారు.

- విద్యార్థులు, మైనర్లు బైకులు, కార్లు నడపడం చట్ట విరుద్ధం
- 18 సంవత్సరాలు నిండని పిల్లలకు తల్లిదండ్రులు బైకులు లేదా కారులు ఇవ్వకూడదు.
- ఇలా వారికి వాహనాలు ఇస్తే మోటారు చట్ట ప్రకారం తీవ్రమైన కఠిన చర్యలు తీసుకుంటారు.
- యాక్సిడెంట్లలో మైనర్లకు గాయాలైనా, చనిపోయినా ఇందుకు బాధ్యులుగా వాహనం ఇచ్చిన వారిని గుర్తిస్తూ భారతీయ శిక్షాస్మృతి ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటారు.
- రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా మార్చి ఒకటో తేదీ నుంచి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.
- ప్రామాణికత కలిగిన హెల్మెట్ ధరించాల్సి ఉంటుంది.
- హెల్మెట్ ధరించని పక్షంలో జరిమానా విధిస్తారు.
- హెల్మెట్లు ధరించకపోవడం వల్ల తలకు తీవ్రమైన గాయాలై ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

క్లుప్తంగా

ఉపగ్రహ రూపకల్పనలో విద్యార్థినుల భాగస్వామ్యం



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రాణి

గోకవరం: శ్రీహరికోట నుంచి ఇస్రో ప్రయోగించిన ఎస్ఎస్ఎల్వీ–డి2 ఉపగ్రహ రూపకల్పనలో మండలంలోని వీరలంకపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు భాగస్వామ్యం అయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ కేఎంవీ రాణి శుక్రవారం తెలిపారు. చెన్స్పేస్ కిడ్స్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఆజాదీ శాట్–2 ఉపగ్రహ రూపకల్పనలో భాగంగా దేశంలో 75 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను భాగస్వామ్యం చేశారన్నారు. వీరిలో తమ పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరికి ఆన్లైన్లో శిక్షణ ఇచ్చి ఉపగ్రహం రూపకల్పనలో భాగస్వామ్యం చేశారన్నారు. శుక్రవారం ఉపగ్రహం విజయవంతంగా ప్రయోగించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారికి గైడ్ టీచర్గా వ్యవహరించిన ఎస్.కమల, సాంకేతిక సహకారం అందించిన జి.ఆశాలతను ప్రిన్సిపాల్తో పాటు ఎంఈఓ బి.గౌరమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు యథావిధిగా పాఠశాలలు

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు యథావిధిగా శనివారం పనిచేయనున్నాయి. సాధారణంగా రెండవ శనివారం సెలవు దినం అయినప్పటికీ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల ప్రకారం కాంపెన్సేటరీ వర్కింగ్ డే గా ప్రకటించారు. సంక్రాంతి సెలవుల అనంతరం జనవరి 18వ తేదీన తీసుకున్న సెలవుకు బదులుగా ఈ రెండో శనివారం అన్ని పాఠశాలలు పనిచేయాల్సి ఉందని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.

వేధింపులు తాళలేక యువకుడి ఆత్మహత్య



యాదగిరి శ్రీను (ఫైల్)

రౌతులపూడి: మండల కేంద్రమైన రౌతులపూడికి చెందిన యాదగిరి శ్రీను(25) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలావున్నాయి. మూడేళ్ల క్రితం అతను తల్లిదండ్రులను కోల్పోయాడు. వారు చేసిన అప్పులు తీర్చాలంటూ రుణదాతలు చేసిన ఒత్తిళ్లకు తాళలేక బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పురుగుల మందు తాగిన అతనిని చుట్టుపక్కలవారు కాకినాడ జీజీహెచ్కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు వివరించారు.

భవిష్యత్తును చిదిమేసిన రోడ్డు ప్రమాదాలు

ఆ విద్యార్థుల బంగారు భవిష్యత్తును రోడ్డు ప్రమాదాలు చిదిమేశాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శుక్రవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు పదో తరగతి విద్యార్థులు మృత్యువాత పడ్డారు. రాజమహేంద్రవరం స్నేహితులతో సరదాగా బైక్పై హోటల్కి బయలుదేరిన ఇద్దరు విద్యార్థులు డివైడర్ను ఢీకొని తిరిగిరానిలోకాలకు వెళ్లిపోయారు. తుని మండలం ఎస్. అన్నవరం శివారులో ఒక శుభకార్యక్రమానికి వెళ్లి కాలినడకన తిరిగివస్తున్న విద్యార్థిని మోటార్ సైక్లిస్ట్ ఢీకొనడంతో అసువులు బాసాడు. ఎంతో భవిష్యత్తు వున్న తమ పిల్లలు ఇలా అర్థాంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

డివైడర్ను ఢీకొని ఇద్దరు మృత్యువాత

రాజమహేంద్రవరం రూరల్: టెన్త్ క్లాస్ ప్రీ ఫైనల్ పరీక్షలు పూర్తయ్యాయి. స్నేహితులతో సరదాగా హోటల్కు వెళదామని బైక్పై బయలుదేరిన ఎస్.లక్ష్మీనారాయణ (15), బి.లాస్య (15) లారీని తప్పించబోయి డివైడర్ను ఢీకొట్టడంతో మృతిచెందారు. ఈ విషాద ఘటన జాతీయ రహదారిపై కవలగొయ్యి సెంటర్కు కొద్దిదూరంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. డివైడర్ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లాస్య అప్పటికే మృతిచెందగా,



లాస్య (ఫైల్)



లక్ష్మీనారాయణ (ఫైల్)

లక్ష్మీనారాయణ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం బొమ్మూరుకు చెందిన లక్ష్మీనారాయణ ధవళేశ్వరం ఎర్రకొండకు చెందిన లాస్య బొమ్మూరులోని ఇంగ్లిషు మీడియం స్కూల్లో పదో తరగతి చదువుతున్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలు పూర్తవడంతో ప్రిపరేషన్ హాలీడేస్ ఇచ్చారు. దీంతో హోటల్కు వెళదామని వీరు స్నేహితులతో కలిసి బైక్లపై బొమ్మూరు నుంచి లాలాచెరువు వైపు బయలుదేరారు. జాతీయ రహదారిపై కవలగొయ్యి సెంటర్ దాటిన తరువాత కొద్దిదూరంలో లారీని తప్పించుకుని ముందుకు వెళుతుండగా డివైడర్ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరి తలలకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్లో స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి తండ్రి నల్లంరెడ్డి ఉమామహేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రకాశంనగర్ పోలీస్స్టేషన్ ఇన్స్పెక్టర్ పవన్కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల ఆశలు అడియాస

బాగా చదువుకుని ఉన్నత స్థాయికి వెళతారన్న వారి



ప్రమాదంలో గాయపడ్డ లక్ష్మీనారాయణ

తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. బొమ్మూరుకు చెందిన ఉమామహేశ్వర్ హార్లిక్స్ ఫ్యాక్టరీలో టెంపరరీగా పనిచేస్తూ, కిరాణాషాపు నిర్వహిస్తూ కుమార్తె, కుమారుడిని చదివిస్తున్నారు. సంతానంలో రెండోవాడైన లక్ష్మీనారాయణ రోడ్డుప్రమాదంలో మృత్యువాతపడడంతో ఆ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతానికి చెందిన బి.శ్రీనివాస్ రెస్టారెంట్లో పనిచేస్తూ లాస్య ఏకైక కుమార్తె కావడంతో గారాబంగా పెంచుకున్నారు. లాస్య మృతిచెందడంపై తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. అందరితోను నవ్వుతూ మాట్లాడే లక్ష్మీనారాయణ, లాస్యలు మృతిచెందడంతో అటు పాఠశాలలోను, వారి నివాసప్రాంతాల్లోను విషాద ఛాయలు అలుముకున్నాయి.



గాయపడ్డ లాస్య

మోటార్ సైకిల్ ఢీకొని విద్యార్థి మృతి



సాయిశ్రీకర్ మృతదేహం

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం శివారు సాయివేదిక సమీపంలో మోటార్ సైకిల్ ఢీకొనడంతో తుని పట్టణానికి చెందిన యండమూరి ఠాకూర్ సాయిశ్రీకర్ (15) మృతి చెందినట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి వేదికలో జరిగిన శుభకార్యానికి హాజరై తుని నడచివస్తుండగా మోటార్ సైకిలిస్టు ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన సాయి శ్రీకర్ను తుని ఏరియా ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై వివరించారు. సాయి శ్రీకర్ పదో తరగతి చదువుతున్నాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యాచకురాలి మృతి

రాజమహేంద్రవరం రూరల్: కంటైనర్ లారీ ఢీకొని సుమారు 60 ఏళ్ల వయసు గల యాచకురాలు మృతి చెందింది. ఈ ఘటన దివాన్చెరువు పెట్రోలుబంకు దాటిన తరువాత గైట్ కళాశాల దగ్గరలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కంటైనర్ లారీ డ్రైవర్ అతివేగంగా నిర్లక్ష్యంగా హారన్ కొట్టకుండా ఢీకొనడం వల్ల మృతిచెందిందని, డ్రైవర్పై కేసు దర్యాప్తు చేస్తున్నామని బొమ్మూరు పోలీస్స్టేషన్ ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

నయవంచకుడికి పదేళ్ల జైలు

కాకినాడ లీగల్: యువతికి మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడి పెళ్లి చేసుకోవడానికి ముఖం చాటేసిన నయవంచకుడికి పదేళ్ల జైలు, రూ.రెండు వేలు జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ద్వారపూడికి చెందిన కోమ్మన శ్రీ దుర్గ శివకుమార్ మేనేజర్గా శక్తి ట్రాన్స్పోర్ట్లో పనిచేస్తున్నాడు. అదే ట్రాన్స్పోర్ట్లో 2015 సంవత్సరం నుంచి కంప్యూటర్ ఆపరేటర్గా యువతి పనిచేస్తోంది. యువతిని ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి వంచించాడు. యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. దీంతో 2016లో పెళ్లి చేసుకోవాలని యువతి శివకుమార్ను నిలదీయగా అతడు నిరాకరించాడు. 2016లో మండపేట రూరల్ పోలీసులకు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయగా లైంగికదాడికి పాల్పడినందుకు ఐపీసీ సెక్షన్ 376 ,పోక్సో చట్టం కింద కేసు ఎస్సై విద్యాసాగర్ నమోదు చేశారు. కోర్టు విచారణలో శివకుమార్ పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

ముగిసిన సీబీఏ-2, ఫార్మేటివ్ పరీక్షలు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

రాయవరం: విద్యార్థుల్లో విద్యాస్థాయిని, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు నిర్వహించిన క్లాస్ రూమ్ బేస్డ్–2, ఫార్మేటివ్–3 పరీక్షలు శుక్రవారంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముగిశాయి. ఈ నెల ఏడవ తేదీన సీబీఏ–2, ఫార్మేటివ్–3 పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ విద్యా సంవత్సరం నుంచి నూతనంగా క్లాస్రూమ్ బేస్డ్ అసెస్మెంట్ను ఒకటి నుంచి 8వ తరగతి వరకు ప్రవేశ పెట్టిన విషయం విదితమే. 9,10 విద్యార్థులకు గతంలో మాదిరిగానే ఫార్మేటివ్ అసెస్మెంట్ విధానంలో పరీక్షలు నిర్వహించారు. ఈ రెండు రకాల పరీక్షలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. నూతన విధానంలో నిర్వహించిన సీబీఏ–2 పరీక్షలకు ఓఎంఆర్ షీట్లను వాడడంలో ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విద్యాశాఖాధికారులు, సీఆర్పీలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అయితే సీబీఏ–1 పరీక్షలను గతేడాది నవంబర్లో నిర్వహించడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సీబీఏ విధానంలో నిర్వహిస్తున్న పరీక్షలపై పూర్తి స్థాయి అవగాహన వచ్చిందని చెప్పవచ్చు. అయినప్పటికీ విద్యార్థులు పరీక్షల్లో సమాధానాలు రాయడంలో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు తనిఖీలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల పరిధిలోని 7.42 లక్షల మంది విద్యార్థులు సీబీఏ–2, ఫార్మేటివ్–3 పరీక్షలు రాశారు. వచ్చే నెలలో ఫార్మేటివ్–4, ఏప్రిల్లో సమ్మేటివ్–2 పరీక్షలను విద్యాశాఖ నిర్వహించనుంది. ఫార్మేటివ్–4 పాత విధానంలో నిర్వహిస్తుండగా, సమ్మేటివ్–2 పరీక్షలను మాత్రం 1–8 తరగతులకు సీబీఏ విధానంలో, 9,10 తరగతులకు ఫార్మేటివ్ విధానంలో నిర్వహిస్తారు.

రాజు న్యూరోలో సూపర్ స్పెషాలిటీ సేవలు



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ బలభద్ర వెంకటరాజు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక రాజు న్యూరో అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో ఆదివారం నుంచి గ్యాస్ట్రో ఎంట్రాలజీ సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభిస్తున్నారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బలభద్ర వెంకట్రాజు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం చిన్న క్లినిక్గా ప్రారంభమైన రాజు న్యూరో నేడు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో పాటు, ఈహెచ్ఎస్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు అందిస్తోందన్నారు. డాక్టర్ రఘువీర్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, హెపటాలజి సేవలు అందిస్తారన్నారు. కార్డియాక్ విభాగం ఇప్పటికే సమర్ధంగా పనిచేస్తోందన్నారు. డాక్టర్ బలభద్ర రఘువీర్ మాట్లాడుతూ జీర్ణకోశ సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్సకు ఎండోస్కోపీ, కోలోనోస్కోపీలతో పాటు రాజమహేంద్రవరంలోనే మొట్ట మొదటిసారిగా మానోమెట్రీ, బయో ఫీడ్ బ్యాక్, రిఫ్లక్స్ మానిటరింగ్ సిస్టం, హెచ్ పైలోరి బ్రెత్ టెస్ట్ పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అన్నం మింగడంలో సమస్యలు, కడుపులో మంట, ఉబ్బరం, అల్సర్, వాంతులు, రక్తపు వాంతులు, దీర్ఘ కాలిక విరేచనాలు, పేగులో క్షయ, పైల్స్, లివర్ సమస్యలు, ఆహారం తీసుకున్న వెంటనే గొంతు నొప్పి, కామెర్లు, ఫాటీ లివర్, గాల్ బ్లాడర్, పాంక్రియాస్ సమస్యలు, నాణేలు, పిన్నీసులు, చేపముల్లు, ఎముకలు, అన్నవాహికలో అడ్డుపడితే గుర్తించి తీయడం వంటి వాటికి అత్యాధునిక పద్ధతిలో చికిత్సలు లభిస్తాయన్నారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ వినోద్ కుమార్, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ మౌనిక, ఆర్థోపెడిషన్ డాక్టర్ ప్రదీప్ గంధర్వ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నక్కిన రవిచైతన్య, పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



చిమ్మ వెంకన్న మృతదేహం

కిర్లంపూడి: కాలువలో పడి వ్యక్తి మరణించిన ఘటన శుక్రవారం ఎస్.తిమ్మాపురంలో చోటు చేసుకుంది. ఎస్సై టి.రఘునాథరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన చిమ్మ వెంకన్న(52) పొలం పనులకు అని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. స్థానికులు వెతకగా తామరాడకు దగ్గరలో ఉన్న రేవడి కాలువలో వెంకన్న శవమై తేలి ఉండడం గమనించినట్లు తెలిపారు. మృతుడు కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత చంద్రశేఖర్కు సత్కారం

శ్రీ ప్రకాష్లో కన్నుల పండువగా 'హరివిల్లు'

పెద్దాపురం: స్థానిక రామారావుపేట శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో 'హరివిల్లు' చిత్రలేఖన ప్రదర్శన శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత, కాకినాడ సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంకురాత్రి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పిన్న వయసులోనే విద్యార్థులు ఇలా అద్భుతాలను సృష్టించారంటే భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. చిత్రలేఖన కళాకారుడు, ప్రొఫెసర్ సుధాకర్రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చేసిన ప్రయోగాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. పాఠశాల డైరెక్టర్ విజయ్ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభతో పాటు సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. అనంతరం కాకినాడ, పెద్దాపురం శ్రీ ప్రకాష్ విద్యార్థులు ఏర్పాటు చేసిన చిత్రలేఖన ప్రదర్శనను తిలకించి ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. తొలుత పద్మశ్రీ అవార్డు గ్రహీత చంద్రశేఖర్ను పాఠశాల డైరెక్టర్ విజయ్ప్రకాష్, సిబ్బంది సత్కరించారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, అకడమిక్ అండ్ కల్చరల్ కో–ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



పద్మశ్రీ అవార్డు గ్రహీత చంద్రశేఖర్ను సత్కరిస్తున్న విజయ్ప్రకాష్

ద్వారపూడిలో అరుదైన పాము

- రెడ్సాండ్ బోయాగా గుర్తింపు
- మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో వదలిన అటవీశాఖ అధికారులు



బాక్స్లో ఉన్న పామును స్వాధీనం చేసుకుంటున్న ఫారెస్ట్ అధికారులు

మండపేట: మండలంలోని ద్వారపూడిలో రెండు తలల రూపంలో అరుదైన పాము స్థానికులకు లభ్యమైంది. ఈ సమాచారం గ్రామంలో వైరల్ అయ్యింది. ద్వారపూడికి చెందిన కత్తుల లోవరాజు గురువారం పొలంలో పనిచేస్తుండగా రెండు తలలను పోలి విచిత్ర రూపంలో ఉన్న పామును గుర్తించాడు. దాన్ని పట్టుకుని ఊళ్లోకి తీసుకువచ్చాడు. మీటరు వరకు పొడవు ఉండి మూడు కిలోల వరకు బరువు ఉన్నట్టు స్థానికులు తెలిపారు. అరుదైన పాముగా భావించి లోవరాజు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాడు. సాయంత్రం ఫారెస్ట్ సెక్షన్ అధికారి బాలబ్బాయి గ్రామానికి చేరుకుని పామును స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఫారెస్ట్ అధికారి ప్రసాదరావు ఆదేశాల మేరకు మారేడుమిల్లి అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి విడిచిపెట్టినట్టు బాలబ్బాయి తెలిపారు.



రెడ్సాండ్ బోయా

అరుదైన రెడ్సాండ్ బోయా

ఈ పాము గురించి అల్లూరి సీతారామరాజు జిల్లా అటవీశాఖ రేంజర్ కరుణాకర్ను సంప్రదించగా ఈ పాము అరుదైన రెడ్సాండ్ బోయా అని అన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాలు, చిత్తడి నేలల్లో ఇవి ఉంటాయన్నారు. విష రహితమని, చురుగ్గా కదలలేవన్నారు. ఈ పాముకు రెండు తలలు ఉండవని, అయితే ఎలుక బొరియల్లో దూరినప్పుడు చురుగ్గా కదలలేకపోవడం వలన ఎలుకలు కొరికేసి రెండవ వైపు తలను పోలిన ఆకారం ఏర్పడుతుందన్నారు. అంతర్జాతీయంగా స్మగ్లింగ్ జరిగే వన్యప్రాణుల్లో ఈ రెడ్సాండ్ బోయా ఒకటన్నారు. వ్యాపారులు వీటిని రూ.లక్షల్లో కొంటారన్నారు. వీటిని సంరక్షించేందుకు ప్రభుత్వం వన్యప్రాణి సంరక్షణ చట్టం షెడ్యూల్–4లో దీనిని చేర్చిందన్నారు. వీటి స్మగ్లింగ్ చట్టరీత్యా నేరమని తెలిపారు.